

## ఎరువుల గొడౌన్లు తనిఖీ


గొడౌన్ తనిఖీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తణుకు ఎడిఎ జి.నరేంద్ర ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పట్టణ, మండలంలోని కడియద్ద, పెదతాడేపల్లి గ్రామాల్లో ఎరువులు కంపెనీ గొడౌన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎరువుల స్టాక్ రిజిస్టర్, ఫిజికల్ స్టాక్‌ను పరిశీలించారు. రబీ సీజన్ ప్రారంభమైన సందర్భంగా పెద్ద తాడేపల్లి గ్రామంలోని మార్క్‌ఫెడ్ గొడౌన్ల రికార్డులను పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో ఇది వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


నరసాపురంలో..


తణుకులో ఆందోళన చేస్తున్న సహకార ఉద్యోగులు

## సమస్యలు పరిష్కరించాలని
# గళమెత్తిన సహకార ఉద్యోగులు

### డిసిసిబి బ్రాంచి కార్యాలయాల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి - తణుకు

సహకార సంఘాల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కోశాధికారి పివి.ప్రతాప్, సహకార సంఘాల ఉద్యోగుల రాష్ట్ర నాయకులు చిల్లకూరి వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద సహకార ఉద్యోగ సంఘాల (జెఎసి) సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. జిఒ 36 అమలు చేయాలని, రిటైర్మెంట్ వయస్సు 62కు పెంచాలని, 2019 తర్వాత చేరిన వారిని పర్మినెంట్ చేయాలని, సొసైటీ లాభనష్టాలతో సంబంధం లేకుండా జీతాలు ఇవ్వాలని, 2019, 2024 సంవత్సరాల వేతన సవరణ వెంటనే చేయాలని, చట్టప్రకారం గ్రాడ్యూటీ అమలు చేయాలని పెద్దఎత్తున నినదించారు. ఈ సందర్భంగా ప్రతాప్, వెంకటేశ్వరావు మాట్లాడారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చర్చలు జరపాలన్నారు. లేకుంటే జెఎసి ఆధ్వర్యంలో ఆందోళనా కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కొల్లి సత్యనారాయణ, నేతలు ఇ.గోపాలకృష్ణ, పి.విష్ణుమూర్తి, ఆర్.సుబ్బారాయుడు, కె.కిరణ్, డైరెక్టర్ టి.శంకర్, జి.అజయ్‌కృష్ణరాజు, ఎ.జగదీష్, శ్రీనివాస్, గార రంగారావు పాల్గొన్నారు.


వీరవాసరంలో..

**వీరవాసరం:** తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే నెరవేర్చాలని సహకార సంఘాల ఉద్యోగులు సోమవారం స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించారు. అండలూరు, వీరవాసరం, రాయకుదురు, శృంగవృక్షం సహకార సంఘాల ఉద్యోగుల సంఘ కార్యదర్శులు లింగం శ్రీనివాస్, అడబాల రామలింగేశ్వరావు, యాళ్లబండి శ్రీనివాస్‌ప్రసాద్, మేడిది గణపతిరవీంద్రనాథ్ (బ్రాంచి కమిటీ సభ్యుడు), సిబ్బంది ధర్నాలో పాల్గొన్నారు. జిఒ నెం.36 వెంటనే అమలు చేయాలని నినదించారు. కార్యక్రమంలో యాళ్లబండి వీరబాబు, సతీష్, కొత్తపల్లి నాగేంద్ర, సుబ్బారావు, తోట సురేష్, నాగేశ్వరరావు, ఇంటి రాఘవేంద్ర పాల్గొన్నారు.


మొగల్తూరులో..

**నరసాపురం:** సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద సోమవారం సహకార ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని నినదించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని బ్రాంచి మేనేజర్ పిబి.శ్రీవాణికి సమర్పించారు. ఈ ఆందోళనకు సిఐటియు జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కొయ్య ఏసుప్రభు, అడపా నాగరాజు, మేడిది శ్రీనివాస్, దొడ్డ లక్ష్మణరావు, పి.మాధవరావు, ముదునూరి సత్యనారాయణరాజు, దాసరి శ్రీను, కొప్పినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** సొసైటీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సొసైటీ ఉద్యోగుల ఆందోళనలో భాగంగా సోమవారం స్థానిక డిసిసిబి బ్రాంచి కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సొసైటీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అనంతరం బ్రాంచి మేనేజర్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఆయా కార్యక్రమాల్లో సొసైటీ కార్యదర్శులు గుబ్బల శ్రీనివాసరావు, కొత్తపల్లి గోవిందరాజులు, రంగిశెట్టి అర్జున్‌రావు, మేళం ఫణి, సుంకర ఏసుబాబు పాల్గొన్నారు.

**పాలకొల్లు:** తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ డిసిసిబి ఉద్యోగులు సోమవారం స్థానిక డిసిసిబి బ్రాంచి వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నేతలు పి.కృష్ణారావు, ఎం.మురళీకృష్ణ, కె.కృష్ణకిషోర్, ఆకుల వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాస్, గుడాల ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి
### జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

పిజిఆర్‌ఎస్‌లో ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి పిజిఆర్‌ఎస్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డితోపాటు డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, గ్రామ, వార్డు సచివాలయాధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వరరావు, జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 198 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. తమ శాఖ పరిధిలో లేని ఫిర్యాదులు వస్తే వాటిని తక్షణమే సంబంధిత శాఖాధికారులకు పంపించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యల పరిష్కారం ఉండాలన్నారు. అధికారులు లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ ఆందోళన బాట

**నేడు, రేపు తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు**
**18న డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా**
**యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు విజయరామరాజు, రామభద్రం**

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ ఆందోళన బాట పట్టింది. దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలతోపాటు ప్రభుత్వ విద్యారంగంలో తీసుకుంటున్న నిర్ణయాలతో ఉపాధ్యాయులకు ఏర్పడుతున్న సమస్యలపై గళం విప్పేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఉపాధ్యాయుల ఆందోళన బాటకు సంబంధించిన ప్రణాళికను యుటిఎఫ్ జిల్లా కమిటీ రూపొందించింది. దీనిలో భాగంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకె.రామభద్రం సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని, టెట్‌పై సుప్రీంకోర్టు తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటీషన్ వేయాలని కోరుతూ ఈ నెల 9, 10 తేదీల్లో అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 18న డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్నట్లు ప్రకటించారు. దీనికి జిల్లాలోని ఉపాధ్యాయులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. వంద రోజులు యాక్షన్ ప్లాన్ నుండి ఆదివారాలు, పబ్లిక్ హాలిడేలు మినహాయించి రీషెడ్యూల్ చేయాలని డిమాండ్ చేశారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను తక్షణమే రిలీవ్ చేయాలని కోరారు. ఈ సమస్యలపై జరగబోయే నిరసన కార్యక్రమాల్లో పాలకొల్లు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం కేంద్రాల్లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

## టెట్ నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- 10 నుంచి 21వ తేదీ వరకు పరీక్షల నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా 8 కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 12,985 మంది అభ్యర్థులు
- జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఎపి టెట్ (టీచర్స్ అర్హత) పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం టెట్ పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఈ నెల 10వ తేదీ నుండి 21వ తేదీ వరకు టెట్ పరీక్షలు జరగనున్నాయన్నారు. జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భీమవరంలో శ్రీ విష్ణు ఇంజినీరింగ్ కాలేజీ ఉమెన్స్, డిఎన్‌ఆర్ కాలేజీ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, డిఎన్‌ఆర్ కాలేజీ అటామస్, నరసాపురంలో స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ, తాడేపల్లిగూడెంలో శ్రీ వాసవి ఇంజినీరింగ్ కాలేజీ, శశి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ ఇంజినీరింగ్ కాలేజీల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్షలు మొదటి షిఫ్ట్ ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల జరగనున్నాయని తెలిపారు. జిల్లాలో 12,985 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు.

**వందరోజుల కార్యాచరణ అమలు.. నూరు శాతం ఫలితాలు సాధించాలి**

ఎంపిడిఒలు, మండలస్థాయి అధికారులు ప్రతి హైస్కూల్‌కు వెళ్లి పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలవుతున్నది, లేనిదీ పరిశీలించాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాలపై చర్చించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల స్పందన తెలుసుకుని విద్యాశాఖ అధికారులకు తెలపాలన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి పెద్ద పాఠశాలల్లో జిల్లా అధికారులు సందర్శించి వందరోజుల ప్రణాళిక అమలును పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పులి శాంతి, డిటిఒ కృష్ణారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ గీతాబాయి, భీమవరం అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎ.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# తీరని కష్టం.. నష్టం..!


**పరిష్కారానికి నోచుకోని పిజిఆర్‌ఎస్ సమస్యలు**
**76 సార్లు ఫిర్యాదు చేసినా అధికారులకు పట్టని భూసమస్య**
**అర్హతున్నా అందని పింఛన్.. బాధితులు గగ్గోలు**
**పారిశుధ్య కార్మికురాలి భర్తకు పింఛన్ కట్**
**గత్యంతరం లేక పిజిఆర్‌ఎస్‌నే ఆశ్రయిస్తున్న జనం**


ప్రజల సమస్యలు వింటున్న ఏలూరు జెసి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పిజిఆర్‌ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో అర్జీలు ఇస్తున్నా పరిష్కారం కాని పరిస్థితి. ముఖ్యంగా భూముల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పిజిఆర్‌ఎస్‌కు పదులసార్లు వచ్చి ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేకుండాపోయింది. జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే పిజిఆర్‌ఎస్ కార్యక్రమానికి 300కుపైగా అర్జీలు ప్రజల నుంచి వస్తున్నాయి. సోమవారం జరిగిన పిజిఆర్‌ఎస్‌లో సైతం 363 అర్జీలు వచ్చాయి. అర్జీలు స్వీకరించిన జిల్లా ఉన్నతాధికారులు సంబంధిత శాఖల అధికారులకు అప్పగిస్తున్నారు. వారు మండలాల్లోని అధికారులకు పంపుతున్నారు. నెలలు, ఏళ్లు గడిచిపోతున్నాయే తప్ప సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడేనికి చెందిన మహిళ తమ తల్లిదండ్రుల నుంచి వచ్చిన అసైన్డ్ భూమిని ఇంకొకరి పేరున ఆన్‌లైన్ చేశారంటూ ఇప్పటి వరకూ 76 సార్లు పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఫిర్యాదును కనీసం పరిశీలించకుండా స్థానిక అధికారులు మూసేస్తున్న పరిస్థితి ఉంది. అసైన్డ్ భూమి వారసత్వంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వస్తుంది. అంతే తప్ప గ్రామంలోని వేరే సామాజిక తరగతికి చెందిన వ్యక్తుల పేరున ఏవిధంగా ఆన్‌లైన్ చేస్తారో ఏఒక్కరికీ అర్థం కాని పరిస్థితి. కొయ్యలగూడెం మండలం సరిపల్లి గ్రామానికి చెందిన వ్యక్తికి చెందిన ఇంటి స్థలం అదే కుటుంబంలోని వేరొకరి పేరున అధికారులు రాసిచ్చేశారని బాధితుడు గగ్గోలు పెడుతున్నారు. స్థానిక విఆర్‌ఒ తమ గోడు ఏమాత్రం పట్టించుకోవడం లేదని బాధితుడు నెత్తినోరు మొత్తుకుంటున్నారు. ఇలా అనేక భూసమస్యలు పిజిఆర్‌ఎస్‌కు వస్తున్నా పరిష్కారం మాత్రం కావడం లేదు. రీసర్వేలో తమ భూమి విస్తీర్ణం తేడా వచ్చిందని కొంతమంది, పట్టా తమ పేరున ఉన్నా ఆన్‌లైన్‌లో వేరేవారి పేరు చూపిస్తుందని కొంతమంది, పట్టా భూమిని ప్రభుత్వ భూమికి నమోదు చేశారని మరికొంతమంది, ఇలా ఎంతోమంది బాధితులు రెవెన్యూ సమస్యలతో పిజిఆర్‌ఎస్‌ను ఆశ్రయిస్తున్నారు. అయితే ఎన్నిసార్లు తిరిగినా సమస్య మాత్రం పరిష్కారం కాకపోవడం వారందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. సమస్యను పరిష్కరించే ఉద్దేశం అసలు రెవెన్యూ అధికారులకు ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అర్హతున్నా పింఛన్లు రావడం లేదని పిజిఆర్‌ఎస్‌లో ప్రతివారం పెద్దఎత్తున ఫిర్యాదులు అందుతున్నా పరిష్కారం మాత్రం చూపడం లేదు. ఫిర్యాదులు తీసుకోవడం, సమీక్షలు చేయడం తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. కూటమి ప్రభుత్వం పిజిఆర్‌ఎస్ సమస్యల పరిష్కారంపై గట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు.

## సత్తిబాబుపై చర్యలు తీసుకోవాలని జెసి, డిఎస్‌పికి వినతి




డిఎస్‌పికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి కౌన్సిల్ సభ్యులను నిర్బంధించిన గోరి సత్తిబాబుపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకటరమణ, వైసిపి కౌన్సిలర్లు జాయింట్ కలెక్టర్‌ను, డిఎస్‌పిని కోరారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో పిజిఆర్‌ఎస్‌లో జెసి రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ నెల ఆరో తేదీన మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం వాయిదా పడిందని పేర్కొన్నారు. ఆ సమయంలో కౌన్సిల్‌కు సంబంధం లేని గోరు సత్తిబాబు అనే వ్యక్తి మహిళలున్నారని కూడా చూడకుండా మున్సిపల్ కార్యాలయానికి బయట తాళం వేసి నిర్బంధించారని తెలిపారు. పైగా పెట్రోల్ పోసి అంటించేస్తానని సత్తిబాబు తమను భయభ్రాంతులకు గురి చేశారని పేర్కొన్నారు. 8వ వార్డు కౌన్సిలర్ బర్రె జయరాజు, మరికొంతమంది గేటు తాళం పగులగొట్టి, పోలీసులకు ఫోన్ చేయగా వారొచ్చి తమను కాపాడారని తెలిపారు. తాళం వేసి చంపుతానని ఘటనపై విచారణ చేపట్టి, గోరి సత్తిబాబుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ కామన నాగిని, కౌన్సిలర్లు అడిదల శ్యామల, సఖినేటిపల్లి సురేష్, సిర్రా కాంతమ్మ, యర్రా ఉమ, వంగా శ్రీకాంత్, దుర్గా భవాని, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టాలి

**కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు**


జెసితో మాట్లాడుతున్న రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం

ధాన్యం తూకాల్లో మోసాలు అరికట్టి రైతు సేవా కేంద్రంలోనే ధాన్యానికి తేమశాతాన్ని నిర్ణయించాలని, ధాన్యం కొనుగోలుకు కొత్త గోనె సంచులు ఇవ్వాలని కోరుతూ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డికి సోమవారం కలెక్టరేట్లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ మాసూళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. దాదాపు 50 శాతం కోతలు పూర్తయ్యాయన్నారు. ధాన్యం కొనుగోలు సమయంలో ఎదురవుతున్న సమస్యలపై పలు మండలాల్లో పర్యటించి పరిశీలించామని తెలిపారు. ధాన్యం తూచే సమయంలో తూకాల్లో మోసాలు తీవ్ర స్థాయిలో జరుగుతున్నాయని తెలిపారు. పాలకొల్లు మండలంలోని అరట్లకట్ట, పి.పోలవరం, పోడూరు మండలంలోని తూర్పుపాలెం, పెనుగొండ మండలంలోని జిలంచెరువు గ్రామాల్లో ధాన్యం తూకాలను పరిశీలించామన్నారు. ధాన్యం పట్టుబడి 40 కేజీల 600 గ్రాములకు గాను 41 కేజీల 200 గ్రాములు పడుతున్నారని సంచి బరువు ఎక్కడ తూచినా 500 గ్రాముల్లోపే వస్తుందని తెలిపారు. ప్రభుత్వం నలభై కేజీల ఆరు వందల గ్రాములే పట్టమంటుంది కదా ఎక్కువ ఎందుకు పడుతున్నారని రైతులను అడిగితే మాకు ఆ విషయం ఎవరూ చెప్పలేదని చెబుతున్నారన్నారు. వెంటనే సివిల్ సప్లయ్, వ్యవసాయ అధికారులతో మాట్లాడి క్షేత్ర స్థాయిలో రైతులకు, మధ్యవర్తులకు ప్రభుత్వ నిబంధనలపై ప్రచారం చేసి అవగాహన కలిగించి తూకాల్లో, తేమశాతం పేరుతో మోసాలు అరికట్టాలన్నారు. స్పందించిన జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి తూకాల్లో మోసాలు అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతు సంఘం నాయకులు చెల్లబోయిన వెంకటేశ్వరరావు ఉన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఆయాల ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న ఆయాలు

ప్రజాశక్తి - పెనుగొండ

తమ సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం ఇవ్వాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం తహశీల్దార్ అనితాకుమారికి, ఎంఇఒ సుభాకర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆయాలకు ఏడేళ్లుగా కేవలం రూ.6 వేలు వేతనం ఇస్తున్నారని, వారితో రోజుకు 4 సార్లు టాయిలెట్లు, బాత్‌రూమ్‌లు శుభ్రం చేయిస్తున్నారని తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ పాఠశాలలోనే ఉంచి, చీపుర్లు సొంత డబ్బులతో కొనాలని చెబుతున్నారని తెలిపారు. వారికి కనీస వేతనం 26 వేలు చెల్లించాలని, సంబంధం లేని పనులు రద్దు చేయాలని, 2 జతల యూనిఫారాలు ఇవ్వాలని, ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కె.పాదుషా, వి.అరుణ, వై.దుర్గ, ఎన్.ఏసమ్మ, యు.మేరీ, బళ్ల మంగారత్నం, ఎం.నరసమ్మ, కె.రత్నం, కోమల కుమారి పాల్గొన్నారు.

## మాధవాయిపాలెం రేవు పరిశీలన


పంటు తనిఖీ చేస్తున్న అధికారులు

**నరసాపురం:** గోదావరి మధ్యలో సాంకేతిక లోపం కారణంగా పంటు నిలిచిపోయిన విషయం పాఠకులకు విదితమే. అయితే సోమవారం దీనిపై మండల పరిషత్ అధికారులు స్పందించారు. మాధవాయిపాలెం రేవును ఎంపిడిఒ ఎం.నాసరు రెడ్డి సందర్శించారు. నిబంధనలకు అనుగుణంగా గోదావరిలో పంటు రాకపోకలు సాగించాలని, లేని పక్షంలో శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ నాసరు రెడ్డి హెచ్చరించారు. పంటు సామర్థ్యం ఎంత, ఎంత మంది ప్రయాణిస్తున్నారు. రెండు రేవుల మధ్య దూరం, లైఫ్ జాకెట్లు, పంటు పనితీరును తనిఖీ చేశారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్న తరువాతే నదిలో రాకపోకలు సాగించాలన్నారు. ఎప్పటికప్పుడు పంటు ఫిట్‌నెస్ చూసుకోవాలన్నారు.

# ఒరిగిన విద్యుత్ స్తంభం..!

### పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఏరియా ఆసుపత్రి నుంచి లక్ష్మణేశ్వరం గ్రామానికి వెళ్లే మార్గంలో వేములదీవి పంట కాలువను ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం ఈదురుగాలులకు ఒరిగిపోయింది. దీంతో ఈ రహదారి గుండా వెళ్లే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలతో జనాలు రద్దీగా ఉండే ఈ రహదారిపై ప్రమాదభరితంగా 11 కెవి విద్యుత్ స్తంభం సగానికి వాలి ఉంది. ఈ విద్యుత్ స్తంభం కొద్ది రోజుల క్రితం గాలివానలకు ఒరిగింది. పెద్ద లైన్ విద్యుత్ వైర్లు కావడంతో రోడ్డుపై స్తంభం పడి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిదని అధికారులను ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు కల్పించుకుని ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు జరగకుండా ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని పలువురు కోరుతున్నారు.



కాలువలోకి ఒరిగిన విద్యుత్ స్తంభం

## నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

### జెసికి వినతి

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం భీమవరం కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలి వెళ్లి జిల్లా జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. తెలగా కళ్యాణ మండపం నుంచి బయలుదేరిన వివిధ వ్యాపార సంస్థ సంఘాల ప్రతినిధులు అసోసియేషన్ ఆధ్వర్యంలో లాంచీ రేవు సెంటర్లో మహాత్మా గాంధీ, టాక్సీ స్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు భీమవరం బయలుదేరి వెళ్లారు. జిల్లా కలెక్టరేట్ వివిధ వ్యాపార సంస్థ సంఘాల అసోసియేషన్ ప్రతినిధుల సంతకాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డచ్ వారి కాలం నుండి ఏలూరు తర్వాత నరసాపురం జిల్లా కేంద్రంగా ఉండేదని, గత వైసిపి ప్రభుత్వం లో ఆనాటి పాలకుల స్వార్థ రాజకీయాల కోసం పట్టణాన్ని విస్మరించి భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించారని తెలిపారు. జిల్లా కేంద్రంగా నరసాపురం పట్టణాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం జెసి రాహుల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సమస్యలపై పోరాట నాయకులు కునపరెడ్డి వీర వెంకట విజయరంగారావు, వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులు చెన్నా రమేష్, దళిత నాయకులు దొండపాటి స్వాములు పాల్గొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని జెసి హామీ ఇచ్చారు.

## పలుచోట్ల కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - మొగల్తూరు

కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని నిరసిస్తూ సోమవారం మొగల్తూరులో వైసిపి రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టగా కూటమి ప్రభుత్వం ఆ కళాశాలలను ప్రయివేటుపరం చేసేందుకు చూడడం దారుణమన్నారు. అనంతరం వైసిపి మొగల్తూరు పట్టణ అధ్యక్షుడుగా లక్కు నారాయణరావు, జిల్లా సెల్ అధ్యక్షుడుగా శ్రీను, త్రైలర్సింగ్, మేడాపు ఫాల అధ్యక్షుడుగా జిల్లా గోపాలకృష్ణ, యూత్ అధ్యక్షుడుగా యల్లమిల్లి గణపతిని నియమించారు. ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, జెడ్‌పిటిసి తిరుమని బాపూజీ, పిడి రాజు, మండల అధ్యక్షుడు రేవు నారాయణమూర్తి పాల్గొన్నారు.

**పెనుమంట్ర:** గడిచిన వారం రోజులుగా కూటమి ప్రభుత్వం తలపెట్టిన మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా మార్టేరు పరిధిలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సోమవారం పూర్తయ్యింది. ఈ మేరకు సేకరించిన సంతకాల దస్త్రాలను మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు, నరసాపురం పార్లమెంటరీ ఇన్‌ఛార్జి ముదునూరి మురళీకృష్ణంరాజులకు స్థానిక వైసిపి నాయకులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కర్నూరి బ్రహ్మేశ్వరరెడ్డి, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - నరసాపురం

సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసిరాజు ఆధ్వర్యంలో సోమవారం ఉచితంగా షుగర్, బిపి పరీక్షలు నిర్వహించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక రోజున వచ్చే ఫిర్యాదుదారుల సౌకర్యార్థం తమ వంతు సేవగా ఉచిత షుగర్, బిపి పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆర్‌డిఒ రాజు తెలిపారు. స్వయంగా ఆయన వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ వైద్య పరీక్షలకు సహకరిస్తున్న మెడ్ యునైటెడ్ హాస్పటల్ యాజమాన్యాన్ని అభినందించారు. మెడ్ యునైటెడ్ ప్రతినిధులు కృష్ణ భగవాన్, మహేష్, కిషోర్ పాల్గొన్నారు.

## జాన్ కుటుంబానికి బీమా సొమ్ము అందజేత

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 31వ వార్డుకు చెందిన కొండేటి జాన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ మేరకు సోమవారం టిడిపి బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును జాన్ భార్య కళ్యాణికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అందజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ టిడిపి ప్రజలు, కార్యకర్తల కోసం పనిచేసే పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకారుల అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సాధికార కమిటీ కన్వీనర్ కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, 31వ వార్డు కౌన్సిలర్ పాలూరి నరసింహారావు పాల్గొన్నారు.

## రోడ్డుకు మరమ్మతులు

### ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు నుండి వెంప రోడ్డుకు అధికారులు సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఈనెల 7వ తేదీన ప్రజాశక్తిలో రహదారికి మోక్షం ఎప్పుడో శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టారు. రహదారిపై ఉన్న పెద్ద పెద్ద గోతులను పూడ్చారు. అలాగే మొగల్తూరు పంచాయతీ గొల్లగూడెంలో రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు.

## తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - నరసాపురం

ఒహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు నెలవారీ శుభ్రపరచకపోవడంతో ప్రజలు కలుషిత నీటిని తాగాల్సి వస్తోందని జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపిపి రమేష్ నాయుడు, ఎంపిటిసి మల్లుల సత్యనారాయణ ఆరోపించారు. పెదపట్నం లంక ఎంపిటిసి నీలకాంత్ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సోని అధ్యక్షత జరిగిన సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. ప్రజలకు ఉపయోగపడేవిధంగా వాటర్ ట్యాంకులు కట్టాలని వైస్ ఎంపిపి రమేష్ నాయుడు, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు పరిష్కరించేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని బందెల భారతి కోరారు. చిట్టవరంలో అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ గోడ నిర్మించాలని నక్క లక్ష్మి నారాయణ కోరారు. నూతన ఎంపిడిఒ నాసరు రెడ్డి డెల్టా ప్రాజెక్టు వైస్ ఛైర్మన్ గుబ్బల మార్తమ్మ, జెడ్‌పిటిసి రాధాకృష్ణ, ఎంపిపి వైస్ ఎంపిపి రమేష్ నాయుడు, ఎంపిటిసి శుభాకాంక్షలు తెలిపారు.

## యువతి అదృశ్యం : కేసు నమోదు

**ఉండి:** యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహాదేవపట్నం గ్రామానికి చెందిన కుక్కల శ్రీనివాస్ ఇంటి నిర్మాణం చేపట్టడంతో తన కుమార్తెను ఉండి మండలం అర్తమూరు గ్రామంలోని తన అత్తవారింటి వద్ద ఉంచాడు. ఈ నెల ఆరో తేదీన కుమార్తె బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఇంటి చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఎంత వెతికినా ఆచూకీ దొరక్కపోవడంతో సోమవారం తండ్రి కుక్కల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దువ్వాపు శ్రీనివాస్ తెలిపారు.



# సిఐటియు ఆలిండియా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - వీరవాసరం

సిఐటియు అఖిల భారత 18వ మహాసభ డోర్ పోస్టర్‌ను సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక, కర్షకుల కోసం నిరంతరం పనిచేసే సిఐటియు మహాసభ విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పాలకులు ప్రయివేటీకరణ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రయివేటుపరం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రశ్నించడమే నేరంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క రోజురోజుకూ ఉపాధి తగ్గి నిజ వేతనాలు పడిపోతున్నా అభివృద్ధి జపం చేస్తున్నారని ఇది ప్రజలను మోసగించడమేనని తెలిపారు. సిఐటియు మండల కన్వీనర్ డి.వరలక్ష్మి మాట్లాడుతూ గోడపత్రికలు, డోర్ పోస్టర్లు, స్టిక్కర్లు, గ్రూపు సమావేశాలు, ఇంటింటికి కరపత్రం పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కో కన్వీనర్ సత్యవతి, రైతు సంఘం నాయకులు అలమహారాజు, వృత్తిదారుల సంఘం నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

**ఇరగవరం :** సిఐటియు 18వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు మండల కమిటీ కన్వీనర్ జుత్తిగ రామాంజనేయులు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఇరగవరం మండల కేంద్రంలో సిఐటియు అఖిలభారత 18వ మహాసభ గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ సిఐటియు మహాసభకు ప్రాధాన్యత ఉందని, బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారని 44 కార్మిక చట్టాలను మూడు కోడ్‌లుగా మార్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కామన మునిస్వామి, డి.విజయలక్ష్మి, కె.అరుణకుమారి, కె.రామకృష్ణ, డి.కనికేశ్వరరావు పాల్గొన్నారు.





పెనుమంట్ర : మాట్లాడుతున్న నేతలు

**భీమవరం టౌన్ :** సిఐటియు 18వ అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భీమవరం మండలం రూరల్ వెంపలోని బస్టాండ్ సెంటర్లో వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులను బానిసలుగా చేయడానికి పూనుకుంటున్నాయన్నారు. కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు ప్రజలపై వేస్తున్న పెట్రోల్, డీజిల్ గ్యాస్ నిత్యావసర ధరలు తగ్గించాలని సిఐటియు నిరంతరం పోరాడుతోందన్నారు. సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కనుమూరి కృష్ణంరాజు, తోటి శుభకర్‌రావు, వి.కన్నమదాసు, ఉల్లంపతి చిన్నకుమార్ అప్పారావు పాల్గొన్నారు.

**యలమంచిలి :** విశాఖపట్నంలో జరనున్న సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని దొడ్డిపట్ల, ఇలపకుర్రు, మేడపాడు, మట్లపాలెం, ఏనుగువానిలంక తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ మాట్లాడుతూ విశాఖపట్నంలో మొదటిసారి జరుగుతున్న సిఐటియు జాతీయ మహాసభకు దేశ నలుమూలల నుండి లక్షల మంది వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాగలక్ష్మి, చిన్నతల్లి, పద్మశ్రీ, నిర్మల, సుమతి, శకుంతల, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

**పెనుమంట్ర :** సిఐటియు మండల కమిటీ సమావేశం సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశానికి ప్రశాంతి అజ్ఞాత అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా నాయకులు సూర్నీడి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ బాద్షా, మండల కన్వీనర్ నేతల చిత్తరంజన్, కౌలు రైతు సంఘం నాయకులు కె.సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు. సిఐటియు 18 వ అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలి


ప్రజాశక్తి - ఇరగవరం

పొదలాడ గ్రామంలో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో ఇరగవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో డ్రెయిన్లు లేక ఇబ్బంది పడుతున్నామని, వాడకం నీరు నిల్వ ఉండడతో ఈగలు, దోమలతో అనారోగ్యాల బారిన పడుతున్నామని తెలిపారు. గ్రామంలో రోడ్డు పాడైందని, వెంటనే గోతులు పూడ్చాలని కోరారు. గ్రామంలో తాగునీటి కొరత ఎక్కువగా ఒందని, వాటర్ ట్యాంకు సామర్థ్యం సరిపోక అందరికీ నీరు అందడం లేదని ట్యాంకు పరిమాణం పెంచాలని డిమాండ్ చేశారు. గ్రామంలో అధికారులు పర్యటించాలని ఎంపిడిఒకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దంపనబోయిన కనికేశ్వరరావు, కొప్పిశెట్టి రామకృష్ణ, దంపనబోయిన డి.విజయలక్ష్మి, కె.అరుణ కుమారి పాల్గొన్నారు.


## ఎస్‌టియు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా సాయివర్మ, రామచంద్రరావు

ప్రజాశక్తి - భీమవరం



సాయివర్మ



రామచంద్రరావు

ఎస్‌టియు జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. ఎస్‌టియు జిల్లా కౌన్సిల్ సమావేశంలో 2026 -2028కి సంబంధించి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌టియు జిల్లా అధ్యక్షునిగా పిఆర్‌విఎస్.సాయివర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కెవి.రామచంద్రరావు, ఆర్థిక కార్యదర్శిగా పివిడి.ప్రసాద్, గుత్తుల శ్రీనివాస్, డి.దావీదును ఎన్నుకున్నారు. అలాగే 18 మంది జిల్లా కార్యవర్గ సభ్యులు, మరో 14 మంది రాష్ట్ర కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయి శ్రీనివాస్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం విద్యారంగం, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ఎస్‌టియు అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేయాలని పిలుపునిచ్చారు.

## పేదలకు సిఎం సహాయ నిధి భరోసా : మంత్రి

ప్రజాశక్తి - పాలకొల్లు

పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సాయంగా సిఎం సహాయ నిధి ఆర్థిక భరోసాను కల్పిస్తుందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులోని కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 38 మందికి వైద్య సాయంగా సిఎం సహాయ నిధి నుంచి రూ.15.50 లక్షల చెక్కులను కూటమి నాయకులతో కలిసి సోమవారం ఆయన అందజేశారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మేలు పొందిన ప్రతి ఒక్కరూ మరో 10 మందికి మంచి చెప్పాలని కోరారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** కూటమి ప్రభుత్వం పార్టీలకు అతీతంగా పేదలకు అందిస్తున్న సిఎం సహాయ నిధిని సద్వినియోగం చేయాలన్న ఉద్దేశంతో ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పనిచేస్తున్నారని జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ అన్నారు. సోమవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో చెక్కులను అడపా ప్రసాద్ చేతుల మీదుగా 8 మంది లబ్ధిదారులకు 13 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.

## చంపుతామని బెదిరిస్తున్నారు.. రక్షణ కల్పించండి

### ఆర్‌డిఒ దాసిరాజుకు వినతి

ప్రజాశక్తి - నరసాపురం

సీతారామపురం సౌత్ గ్రామం రాజులపాలెంలో ఓవర్ హెడ్ ట్యాంకు కింద అక్రమంగా నిర్మించిన సత్తెమ్మ గుడి, అక్రమంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ విగ్రహాలను తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలు వచ్చిన దగ్గర నుండి గ్రామానికి చెందిన కొంతమంది తనను చంపుతానని బెదిరిస్తున్నారని చెరుకూరి సత్య వరప్రసాదరాజు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఫిర్యాదు చేశారు. తరచూ ఈ వ్యక్తులు తమ కుటుంబ సభ్యులను భయాందోళనకు గురి చేస్తున్నారని, రక్షణ కల్పించాలని ఆర్‌డిఒకు వినతి పత్రం అందజేశారు. దీనిపై మొగల్తూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు జిల్లా కలెక్టర్, నరసాపురం డిఎస్‌పికి కూడా ఫిర్యాదు చేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను అనుసరించి ఆలయం విషయంలో తొందరగా నిర్ణయం తీసుకోవడం వల్ల సమస్య సద్దుమణిగే అవకాశం ఉందన్నారు. ఆ వ్యక్తులు తమ ఇంటి ముందుకొచ్చి తనను బెదిరిస్తున్నట్లు వీడియో రికార్డింగ్ కూడా ఉన్నతాధికారులకు అందజేశానని తెలిపారు. సంఘ విద్రోహ శక్తుల చేతిలో తన ప్రాణానికి తన కుటుంబ సభ్యుల ప్రాణాలకు తీవ్ర ముప్పు ఉందని తెలిపారు. ఏదైనా హాని జరిగితే జిల్లా కలెక్టర్ హైకోర్టు ఉత్తర్వుల అమలులో జాప్యం చేసిన అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు.

## క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తా

ప్రజాశక్తి - గణపవరం

గ్రామీణ క్రీడాకారుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎన్‌ఆర్‌ఐ, స్థానికుడు కొనిశెట్టి గణేష్ అన్నారు. గణపవరం అంబేద్కర్ సెంటర్ వద్ద వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యూత్ సభ్యులు గణేష్‌ను కోరడంతో 60 వేలతో వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేసి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీన్ని సోమవారం ప్రారంభించినట్లు తెలిపారు. అంబేద్కర్ యూత్ సభ్యులు కుసుమే రవితేజ, గుడిసే పండు, కొడిదే శ్రీను అభినందనలు తెలిపారు.

## లయన్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్‌గా రామారావు

**పాలకొల్లు:** పాలకొల్లుకు చెందిన సీనియర్ పాత్రికేయుడు ముత్యాల రామారావు లయన్స్ 316డి (కృష్ణా) జిల్లాలో 2024-25 సంవత్సరానికి 'లయన్ ఆఫ్ ది డిస్ట్రిక్ట్‌గా ఎంపికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన అవార్డ్స్ ఫంక్షన్‌లో 2024-25 లయన్స్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి ఈ అవార్డ్‌ను రామారావుకు అందజేశారు. ఈ అవార్డ్‌తో పాటు రామారావుకు 'ఇంటర్నేషనల్ ప్రెసిడెన్షియల్ మెడల్ కూడా లభించింది. 'రత్న ప్రింటింగ్ వర్క్స్' అధినేతగా జిల్లా ప్రజలకు సుపరిచితులైన రామారావు 28 సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ లో వివిధ హోదాల్లో సేవలందించారు. ఆయనను పలువురు అభినందించారు.

## భీమవరంలో శంబాల చిత్ర యూనిట్ సందడి

**భీమవరం టౌన్:** శంబల హీరో ఆది, హీరోయిన్ అర్చన అయ్యర్, నటుడు ఇంద్రనీల్ సోమవారం భీమవరంలో సందడి చేశారు. ముందుగా మావుళ్లమ్మను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు హీరో, హీరోయిన్లతో సత్కరించారు. ఈ సందర్భంగా హీరో ఆది మాట్లాడుతూ డిసెంబర్ 25న తమ చిత్రం శంబాల విడుదలవుతుందని, ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని తెలిపారు. అలాగే భీమవరం అంటే తనకు ప్రత్యేక అభిమానం అని ఇక్కడ ఫుడ్ పెట్టి చంపేస్తారని తెలిపారు. అక్కడ నుంచి జువ్వలపాలెం రోడ్డులో ఉన్న ఎస్‌ఆర్‌కె కళాశాలలో కొంతసేపు విద్యార్థులతో కలిసి సందడి చేశారు. వారి వెంట పాలకోడేరు సొసైటీ ఛైర్మన్ కొత్తపల్లి నాగరాజు చిత్ర యూనిట్ ఉన్నారు.



మావుళ్లమ్మ సన్నిధిలో శంబాల చిత్ర యూనిట్





అర్జీలు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

## గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్‌ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వ్యవస్థలో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 37 ఫిర్యాదులు అర్జీదారుల నుంచి స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**భీమవరం టౌన్:** సోమవారం స్థానిక ఎస్‌పి కార్యాలయంలో జరిగిన పిజిఆర్‌ఎస్‌లో 19 ఫిర్యాదులు అందినట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. ఉదయం నుండి కార్యాలయంలో ఎస్‌పి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించారు. బాధితులతో మాట్లాడి సమస్యను పరిశీలిస్తామని ధైర్యం చెప్పారు. ఆయా పోలీస్‌స్టేషన్‌లోని ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ప్రతి ఫిర్యాదునూ విచారణ చేపట్టి సత్వరమే వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్) వి.భీమారావు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ కెవివిఎన్.సత్యనారాయణ, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ దేశంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** మొగల్తూరులో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు వినతులు అందాయని తహశీల్దార్ కె.రాజ్‌కిషోర్ తెలిపారు. రామన్నపాలెం పంచాయతీ లక్కువారితోటలోని ప్రభుత్వ భూమిలో గ్రామానికి చెందిన ఇంటి నాగేశ్వరరావు పక్కా భవనం నిర్మించారని దీనిపై చర్యలు తీసుకోవాలని అదే ప్రాంతానికి చెందిన అడ్డాల రాంబాబు ఫిర్యాదు చేశారు. ఎంపిడిఒ త్రిశూలపాణి, పిఆర్ ఎఇ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మోహనరావు, ఎంఇఒ యు.శ్యామ్యూల్ జాన్, అధికారులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో ఏడు అర్జీలు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. టౌన్ ప్లానింగ్ సంబంధించి మూడు, ఇంజినీరింగ్ విభాగానికి మూడు, ఎస్టాబ్లిష్మెంట్‌కు ఒక అర్జీ స్వీకరించినట్లు ఆయన తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారమూ జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను పట్టణ ప్రజలు వినియోగించుకోవాలన్నారు. 15వ వార్డు సావిత్రి పేటలో డ్రెయినేజీ ఆక్రమణపై మున్సిపల్ కమిషనర్‌కు అర్జీ అందజేసినట్లు బిజెపి నరసాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి నరిసే సోమేశ్వరరావు తెలిపారు. మున్సిపల్ ఇంజినీర్ వై.వెంకటరమణ, మేనేజర్ రవిసుధాకర్, సుధాకర్, టౌన్ ప్లానింగ్ అధికారి, మెడికల్ అధికారి ఎన్.రాజు మెప్మా పాల్గొన్నారు.




ఆందోళన చేస్తున్న డ్వాక్రా సంఘాల సభ్యులు

## న్యాయం చేయండి

### జాతీయ రహదారిపై డ్వాక్రా మహిళల రాస్తారోకో

ప్రజాశక్తి - ఆకివీడు

ఇటీవల డ్వాక్రా సంఘాల్లో జరిగిన భారీ కుంభకోణానికి సంబంధించి పలు డ్వాక్రా సంఘాలు సోమవారం ఆందోళనకు దిగాయి. తమకు న్యాయం చేయాలంటూ యూనియన్ బ్యాంక్ వద్ద 165 జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సుమారు అరగంట చేసిన రాస్తారోకో నేపథ్యంలో జాతీయ రహదారిపై రెండు కిలోమీటర్ల పైబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఈ పరిస్థితిలో ఎస్‌ఐ హనుమంతు నాగరాజు మహిళలకు నచ్చజెప్పారు. వారిని ఒప్పించి మేనేజర్ వద్దకు తీసుకెళ్లారు. దీంతో మొత్తం మహిళా సంఘాలన్నీ బ్యాంకును ముట్టడించాయి. బ్యాంక్ వారికి తెలియకుండానే మా ఖాతాలో డబ్బులు జమ అయ్యాయా.. మా డబ్బులు బయటకి వెళ్లాయా అంటూ డ్వాక్రా సంఘాలు ప్రశ్నించాయి. డ్వాక్రా సంఘాలు చెప్పిన సమాచారం ప్రకారం సుమారు సంవత్సరం పైగా వాయిదాలు యానిమేటర్ సుధకు అందిస్తున్నామని చెప్పారు. ఈ వాయిదాలకు తోడు కొత్తగా వచ్చిన సీసీ లోను కూడా తమకు తెలియకుండానే ఆమె హస్తగతం అయిందని చెప్పారు. దీనిపై ఖాతాదారులు డబ్బులు చెల్లించాలని బాంకరు అడగడం అన్యాయమని తెలిపారు.. దీనిపై యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ స్పందిస్తూ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశానని, తాను ఇటీవలే వచ్చానని పూర్తిగా పరిశీలించి చెబుతానని చెప్పారు.



బాలకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

## కాళ్ల డిప్యూటీ ఎంపిడిఒగా బాలకృష్ణ మోహన్

**కాళ్ల:** సీసలి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై కాళ్ల డిప్యూటీ ఎంపిడిఒ (సచివాలయాలు) తోట బాలకృష్ణ మోహన్ విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయనకు సోమవారం కాళ్ల మండల పంచాయతీ డెవలప్మెంట్ అధికారులు, సచివాలయ సిబ్బంది స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు డి.సునీల్‌రాజు, బి.సతీష్ కుమార్, ఎం.సాత్వికం, సుంకర వెంకటేష్, కెవి మణికంఠ, చెన్ను సుజాత, ఎస్.అరుణాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సెలవు రోజు పనిచేయాలని వేధించడం సరికాదు

### ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు సాయి శ్రీనివాస్

**భీమవరం :** సెలవు రోజు పనిచేయాలని వేధించడం సరికాదని ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్ అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో సోమవారం ఎస్‌టియు జిల్లా శాఖ 79వ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడితో బోధనేతర పనులతో పనిచేస్తున్నప్పటికీ ఆదివారం కూడా పాఠశాలలో పనిచేయాలని వంద రోజుల షెడ్యూల్ అమలు చేయాలని వేధింపులకు గురి చేయడం మానుకోవాలన్నారు. 12వ పిఆర్‌సి కమిటీని నియమించాలన్నారు. ప్లస్ టు పాఠశాలలో ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయకపోవడం వల్ల ఇంటర్మీడియట్ విద్యార్థులకు నష్టం జరుగుతుందన్నారు. బదిలీ అయ్యి రిలీవ్ కాని ఉపాధ్యాయులకు అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను ఇచ్చి వెంటనే వారందరినీ రిలీవ్ చేయాలన్నారు. సిపిఎస్‌ను రద్దు చేస్తూ నిర్ణయం ప్రకటించాలని, ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలను పరిష్కరించడానికి విద్యాశాఖ మంత్రి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

## తిరుమలలో మాఫియా నడిపిన వ్యక్తి జగన్

### మంత్రి నిమ్మల రామానాయుడు

**పాలకొల్లు:** తిరుమలలో మాఫియా నడిపిన వ్యక్తి జగన్ అని జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో ఆయన కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ పరకామణిలో చోరీని చిన్న దొంగతనమని జగన్ మాట్లాడడం యాత్రికుల నమ్మకాన్ని అవమానించడమేనని తెలిపారు. పరకామణిలో రూ.75 వేల చోరీకే శిక్ష వేస్తారా అని జగన్ ప్రశ్నిస్తున్నాడని, దేవుడు హుండీ సొమ్ము చిన్నదవుతుందా అని మంత్రి ప్రశ్నించారు. జగన్‌కు ప్రజలన్నా, దేవుడు అన్నా భయం లేదన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ వైఖరిలో మార్పు కనిపించడం లేదన్నారు.

## 648 ఎకరాల్లో వరి సాగు

**మొగల్తూరు:** మండలంలోని గ్రామాల్లో సార్వాలో 648 ఎకరాల్లో సాగు చేయటం జరిగిందని వ్యవసాయ మండల అధికారి అబ్దుల్ రహీం తెలిపారు. సోమవారం ఆయన రైతులతో మాట్లాడారు. ఇప్పటివరకూ 250 ఎకరాల్లో కోత పూర్తయ్యిందని తెలిపారు. 459.880 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల సేవా కేంద్రాల ద్వారా విక్రయించారన్నారు. 51 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన తేమశాతం వచ్చేవరకూ ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గ్రేడ్ ఎ రకానికి 100 కేజీలకు 2,389 రూపాయలు, కామన్ రకానికి 100 కేజీలకు 2,369 రూపాయలు ప్రభుత్వం ధర నిర్దేశించిందని రైతులకు అబ్దుల్ రహీం తెలిపారు.

## టిబి రోగులకు పోషకాహార కిట్లు అందజేత

**పాలకొల్లు రూరల్:** లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ ఎం.నవ్య జీవన్ ఆధ్వర్యంలో టిబి ముక్తి భారత్ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు నిక్షయ మిత్ర డాక్టర్ కోసూరి రామకృష్ణ ఆనందరాజు, రోటరీ క్లబ్ సభ్యుల సహకారంతో 20 మంది టిబి రోగులకు పోషకాహారం కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆనంద్‌రాజు మాట్లాడుతూ టిబి మందులు వాడేవారు అదనపు పోషకాహారం తీసుకుని చలిగాలిలో ఎక్కువగా తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నుండి త్వరగా కోలుకుంటారని తెలిపారు. డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి వారికి టిబి యూనిట్‌లో పరీక్షలు చేయించి వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఆరు నెలలకు మందులు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి పోతబత్తుల సత్యనారాయణ, కోశాధికారి గన్న బత్తుల శ్రీనివాస్‌రావు, చందక రాము, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు పాల్గొన్నారు.

## 10, 11 తేదీల్లో ఛాంబర్‌లో పాస్ పోర్ట్ మేళా

**పాలకొల్లు :** ఈ నెల 10, 11వ తేదీల్లో తమ కళాశాలలో పాస్ పోర్ట్ మేళా నిర్వహిస్తున్నట్లు ఛాంబర్ కళాశాల ఛైర్మన్ కెవిఆర్ నరసింహారావు, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు తెలిపారు. భీమవరం పాస్ పోర్ట్ ఆఫీస్ సహకారంతో మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తరగతి మార్క్స్ మెమో, ఆధార్, రూ.1850 ఫీజు చెల్లించాలని, ఈ అవకాశాన్ని కళాశాల స్టాఫ్, విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

గౌరవనీయులైన ప్రిన్సిపల్ సివిల్ జడ్జి
(జూనియర్ డివిజన్) నూజివీడు వారి కోర్టులో
ఓ.యస్.నెం.833/2020

బిట్వీన్ :
యర్రమిల్లి వెంకటేశ్వరరావు అనే వెంకటేసు ...పిటీషనర్
మరియు
పగుట్ల రత్తమ్మ మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్

టు
రెస్పాండెంట్స్ :
**4వ రెస్పాండెంట్ :** పగుట్ల మార్తమ్మ, తండ్రి ఏసోబు, వయస్సు 60 సం॥లు, నివాసం: పోతురెడ్డిపల్లి గ్రామం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా.
**6వ రెస్పాండెంట్ :** పగుట్ల కృపారమ్మ, తండ్రి ఏసోబు, వయస్సు 42 సం॥లు, నివాసం: పోతురెడ్డిపల్లి గ్రామం, నూజివీడు మండలం, ఏలూరు జిల్లా.

పై నెంబరు పిటీషన్‌లో 4,6 రెస్పాండెంట్స్ అయిన మీరు పైన పేర్కొనిన శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా ది.17-12-2025వ తేదీన వున్నది. సదరు తేదీన ఉదయం గం.10.30 ని॥లకు మీరు స్వయంగా గానీ, మీ న్యాయవాది గారి ద్వారా గానీ శ్రీకోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురు.

ఆర్.వి.సత్యనారాయణ
నూజివీడు పిటీషనర్ తరపు న్యాయవాది
తేది.6.11.2025 నూజివీడు, ఏలూరు జిల్లా.